సాక్షి తిరుపతి

శుక్రవారం । 5 । మే । 2023



అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

తిరుపతిలో రాత్రి పూట ఇంటి దొంగతనాలకు పాల్పడే నలుగురు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు.

-8లో



బస్సులను ఢీకొట్టిన లారీ

చంద్రగిరి మండలం, అగరాల జాతీయ రహదారిపై ఆగి ఉన్న బస్సును లారీ ఢీకొనడంతో ఐదుగురు గాయాలపాలయ్యారు.

-8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	26
చిత్తూరు	33	25
తిరుమల	28	21
గూడూరు	34	27
నగరి	34	26

న్యూస్‌రీల్

పాపాలు పండిన బాబుకు జైలు తప్పదు

తిరుపతి కల్చరల్: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుపై సిట్ విచారణను ముందుకు నడిపించాలని సుప్రీంకోర్టు సూచించడం సంతోషించదగ్గ విషయమని మంత్రి ఆర్కే రోజా తెలిపారు. తిరుపతి గంగమ్మ ఆలయంలో మహా కుంభాభిషేకం కార్యక్రమానికి విచ్చేసిన ఆమె మీడియాతో మాట్లాడారు. 6 లక్షల కోట్లు దోచిన చంద్రబాబు జైలుకేనా అన్న విలేకరి ప్రశ్నకు ఆమె స్పందించారు. తప్పులు చేసి స్టేలతో తప్పించుకు తిరుగుతున్న బాబు పాపాలు పండాయని, ఆయనకు జైలుకెళ్లడం తప్పదన్నారు. అమరావతి భూ కుంభకోణం, రియల్ ఎస్టేట్ వ్యాపారంలా ఇన్ ట్రేడింగ్ చేశారని అన్నారు. ఇందులో ఉన్నవారందరూ జైలుకు వెళ్లక తప్పదన్నారు.

పని దినాల కల్పనలో జిల్లా ఫస్ట్

దొరవారిసత్రం: కూలీలకు ఉపాధి హామీ పనుల కల్పనలో డీవీ సత్రం మండలం ఏప్రిల్ నెలకు సంబంధించి తిరుపతి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఎంపీడీఓ సింగయ్య తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరం మొదటి ఏప్రిల్‌లోనే 4,847 కుటుంబాలకు చెందిన 7,499 మంది కూలీలకు 84,016 పని దినాలు కల్పించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

నేడు వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా

తిరుపతి అర్బన్ : వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా రెండో విడత నగదును శుక్రవారం లబ్ధిదారుల ఖాతాల్లో జమచేయనున్నట్టు కలెక్టర్ కే.వెంకటరమణ తెలిపారు. శుక్రవారం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి పెళ్లికూతుళ్ల తల్లుల ఖాతాల్లో నగదు జమచేస్తారని పేర్కొన్నారు. అదే సమయంలో తిరుపతి జిల్లా నుంచి లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో కార్యక్రమాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేపట్టినట్టు ఆయన తెలిపారు.

గంగమ్మా.. మమ్మేలు మాయమ్మ!

తిరుపతి గ్రామదేవత శ్రీతాతయ్యగుంట గంగమ్మతల్లి ఆలయ మహాకుంభాభిషేకానికి సర్వం సిద్ధమైంది. యజ్ఞయాగ పూజాదిక్రతువులు పూర్తిచేసుకుని గర్భాలయం నుంచి గంగమ్మ తల్లి భక్తులను అనుగ్రహించేందుకు సమయం ఆసన్నమైంది. ఈ మేరకు యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేపట్టింది. ప్రాచీన సంప్రదాయాలను పునఃప్రతిష్టించే విధంగా అన్ని చర్యలు పూర్తి చేసింది. రాష్ట్ర పండుగగా ప్రభుత్వం గుర్తించిన నేపథ్యంలో కనీవినీ ఎరుగని రీతిలో మహాకుంభాభిషేకాన్ని నిర్వహించేందుకు యంత్రాంగం సమాయత్తమైంది.



మహా కుంభాభిషేకానికి సిద్ధమైన గర్భాలయం



మూల విగ్రహానికి పుష్పాది వాసం

- నేడు తాతయ్యగుంట గంగమ్మ ఆలయ మహాకుంభాభిషేకం
- అనంతాళ్వార్ వంశీయులు, విజయేంద్ర సరస్వతి స్వామి స్వహస్తాలతో విగ్రహ ప్రతిష్ట
- గర్భాలయంలో కొలువై దర్శనమివ్వనున్న గంగమ్మ తల్లి
- అకుంఠిత దీక్షతో ఆలయాన్ని పూర్తిచేస్తున్న ఎమ్మెల్యే భూమన

తిరుపతి కల్చరల్: తిరుమల శ్రీవారి చెల్లెలుగా, తిరుపతి గ్రామదేవతగా భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీతాతయ్యగుంట గంగమ్మ తల్లి ఆలయ కుంభాభిషేక మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం ఉదయం 6 గంటలకు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ గోపూజ, గర్తన్యాసం, రత్నన్యాస, బీజన్యాస, ధాతు న్యాసం జరగనుంది. 8.20 నుంచి 10 గంటల మధ్య శుభ పుష్కరాంశంలో జగద్గురువు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీస్వామి అమృతహస్తాలతో అమ్మవారి గర్భాలయంలో స్వర్ణ యంత్రస్థాపన, గంగమ్మ దేవత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సాగుతుంది. అనంతరం చతుర్వేద ప్రాణసూక్త పూర్వకం ప్రాణప్రతిష్ఠాపన, ఆలయ శిఖర కలశ ప్రతిష్ట చేపడుతారు. తర్వాత వేద పండితుల చేత పూర్ణకుంభాలతో మహా కుంభాభిషేకం అనంతరంతో పూర్ణాహుతితో అమ్మవారి మహా కుంభాభిషేక మహోత్సవం పరిపూర్ణంకానుంది.

భక్తులకు ప్రథమ దర్శనం

శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ మహా కుంభాభిషేకం అనంతరం అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేపట్టి మధ్యాహ్నం 12.25 గంటలకు నైవేద్యం, హారతి సమర్పిస్తారు. అనంతరం 12.45 గంటలకు గంగమ్మ తల్లి భక్తులకు ప్రథమ దర్శనమివ్వనున్నారు.

ప్రాచీనం..అత్యంత ప్రాశస్త్యం

సాక్షాత్తు తిరుమల శ్రీవారి ప్రథమ శిష్యుడైన అనంతాళ్వార్ వారి అమృత హస్తాలతో సుమారు 1,400 ఏళ్ల క్రితం గంగమ్మ ఆలయాన్ని ప్రతిష్టించినట్టు పురాణాల ద్వారా తెలుస్తోంది. తొలినాళ్లలో సుమారు 400 సంవత్సరాల క్రితం శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు తిరుపతి నగరంలోని గంగమ్మను దర్శించి తర్వాత తిరుమల వెంకన్నను దర్శించే సంప్రదాయం కొనసాగేది. తర్వాత అది కాలక్రమేణ కనుమరుగైంది. ఈ నేపథ్యంలో స్థానికుడిగా గంగమ్మ చరిత్ర తెలిసిన ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి పునర్వైభవం తీసుకురావాలని సంకల్పించారు. ఇందులో భాగంగా ప్రాచీన చారిత్రక విశిష్టతను వెలికి తీయడంతో పాటు అమ్మవారి ఆలయ పునఃనిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతులు, టీటీడీ, దేవదాయశాఖ, భక్తుల సహకారంతో సుమారు రూ.16 వేల కోట్లతో ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా అకున్న సమయానికి అమ్మవారి గర్భాలయాన్ని పరిపూర్తిచేసి, అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, ఆలయ ఆరంభానికి సన్నద్ధమయ్యారు. ఈమేరకు గత ఐదు రోజులుగా గంగమ్మ ఆలయంలో వైదిక, నిత్య కైంకరాలు, యజ్ఞయాగ పూజలు చేపట్టారు. అనంతాళ్వార్ వంశీయులు 22వ తరానికి చెందిన కస్తూరిరంగన్ చేతుల మీదుగా మహా కుంభాభిషేక మహోత్సవం క్రతువును ఆరంభించారు. ఈ యజ్ఞయాగాలు పరిపూర్ణం చేసుకొని శుక్రవారం అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ట చేపట్టనున్నారు. అమ్మవారి ఆలయ శిఖర కలశ స్థాపన అనంతరం నైవేద్యం సమర్పించనున్నారు.



గంగమ్మ తల్లికి విశేష అభిషేకాలు

సుందర శిల్పకళతో గంగమ్మ ఆలయం

తిరుపతి గ్రామదేవత గంగమ్మతల్లి ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా గత ఫిబ్రవరి 10వ తేదీన మొదటి రాతికి పూజలు చేసి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి శంకుస్థాపన చేశారు. ఆయన నిత్య పర్యవేక్షణతో ఆలయ పనులు శరవేగంగా సాగాయి. అనుకున్న విధంగా ఏప్రిల్ 28వ తేదీకి అమ్మవారి గర్భాలయం పూర్తయింది. సుమారు రెండున్నర నెలల్లోనే ఎంతో ప్రాశస్తిత కలిగిన కృష్ణ శిలా రాతితో ఆధ్యాత్మిక కళ ఉట్టిపడేలా అద్భుతంగా అమ్మవారి ఆలయాన్ని తీర్చిదిద్దారు. ఎమ్మెల్యే సంకల్పానికి తోడు టీటీడీ, దేవదాయశాఖ, ఆలయ నిర్మాణ పనుల ప్రతినిధులు, చైర్మన్ కట్టాగోపీయాదవ్, ఈఓ ఎం.మునిక్రిష్ణయ్య, పాలక మండలి సభ్యుల సమిష్టి సహకారంతో అద్భుత రాతి శిల్పకళతో గంగమ్మ ఆలయం పూర్తయింది.



భద్రతా ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

సహస్రనామార్చనలో మంత్రి రోజా



గంగమ్మకు పూజలు చేస్తున్న మంత్రి ఆర్‌కే.రోజా

గంగమ్మ మహా కుంభాభిషేకంలో భాగంగా గురువారం రాత్రి అమ్మవారి గర్భాలయం వద్ద వేద పండితులు నిర్వహించిన సహస్రనామార్చనలో రాష్ట్ర మంత్రి ఆర్కే.రోజా పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి పూజలు నిర్వహించారు. అంతకుముందు భద్రతా ఏర్పాట్లను ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి పరిశీలించారు.

200 మందితో చండీ సప్తశతీపారాయణం

శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ మహాకుంభాభిషేక మహోత్సవంలో భాగంగా గురువారం నాలుగో రోజు ఉదయం గోపూజ, అధివాస అంగహోమాలు చేపట్టారు. వేద పండితుల వేదపారాయణం, వివిధ యజ్ఞ యాగ పూజలు, ప్రతిష్ఠాంగ హోమాలు నిర్వహించారు. అనంతరం 200 మంది సువాసినీ స్త్రీలు సమగ్ర చండీ సప్తశతీ పారాయణం చేపట్టారు. సాయంత్రం యాగశాలలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చేతుల మీదుగా బంగారు తాపడంతో రూపొందించిన కలశాన్ని అర్చకులు అందజేశారు. మేయర్ డాక్టర్ శిరీష, ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, పాలక మండలి సభ్యులు టి.వెంకటేశ్వరరావు, ఎం.హరినాథ్‌రెడ్డి, టి.రమణమ్మ, పి.ధనశేఖర్, వి.కృష్ణమ్మ, వి.గీత, ఎస్.భారతి పాల్గొన్నారు.

లక్ష రూపాయల విరాళం

గంగమ్మకు డాక్టర్ సుధారాణి లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. ఈమేరకు విరాళాన్ని ఆమె ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆలయ చైర్మన్, ఈవోలకు అందించారు.



విరాళం అందజేస్తున్న డాక్టర్ సుధారాణి

కుప్పం.. కప్పం!



- కుప్పంకి చెందిన ఎంపీపీ స్థాయి టీడీపీ నాయకుడు.. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బాగానే సంపాదించాడు. అతని వద్దకు టీడీపీకి చెందిన ముఖ్యనాయకుడు ఒకరు ఇటీవల వెళ్లాడు. 'అన్నా మనం అధికారంలోకి రాబోతున్నాం.. నువ్వేమీ దిగులు పడొద్దు.. అధికారం వచ్చాక మండలంలో నువ్వే నాయకుడివి.. నిన్ను కాదని ఏ పనీ జరగదు. రాబోయే ఎన్నికల కోసం బాగా ఖర్చుచేయాల్సి వస్తుంది. రూ.25 లక్షలు పార్టీ ఫండ్‌గా ఇవ్వాలి. ఇది పై నుంచి ఆర్డర్. డబ్బులు త్వరగా సిద్ధం చేయండి' అని డిమాండ్ చేశారు.
- శాంతిపురం మండలానికి చెందిన మరో టీడీపీ నాయకుడి ఇంటికి వెళ్లిన ఆ ముఖ్య నేత.. 'పార్టీ కోసం మీరు బాగా పనిచేశారు. మిమ్మల్ని పార్టీ గుర్తించింది. 2024లో మనదే అధికారం. అధికారం వచ్చాక మండల బాధ్యతలన్నీ మీ చేతుల్లోనే ఉంటాయి. కాంట్రాక్టు పనులు, మైనింగ్ లీజులు.. బదిలీలు.. ఇతరత్రా అన్నీ మీ కనుసన్నల్లోనే నడుస్తాయి. వచ్చే ఎన్నికలకు మీరంతా సిద్ధంగా ఉండాలి. పార్టీ ఫండ్‌గా మీరు రూ.10 లక్షల వరకు ఇవ్వాలి. ఇది పై నుంచి వచ్చిన ఆదేశాలు. మీరు ఎప్పుడు రమ్మని చెబితే అప్పుడు నేనే వచ్చి తీసుకెళ్తా.'

.. ఇవీ కుప్పంలో తాజా పరిస్థితులు. టీడీపీ అధిష్టానం పెద్దలు చెప్పారంటూ.. ఓ ముఖ్యమైన నాయకుడు పార్టీ ఫండ్ పేరుతో వసూళ్లకు దిగుతున్నాడు. వివిధ వ్యాపారుల నుంచి లక్షల్లో వసూళ్లు చేస్తున్నాడు. మరో వైపు కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవి ఇప్పిస్తామంటూ.. స్థానిక టీడీపీ నాయకుల నుంచి కూడా డబ్బులు డిమాండ్ చేస్తున్నాడు. ఇదంతా చంద్రబాబు కనుసన్నల్లోనే జరుగుతోందని స్థానిక నాయకులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే కొందరి వద్ద రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. మైనింగ్ వ్యాపారులు, కర్ణాటకలో మద్యం వ్యాపారం చేస్తున్న వారు, భూ స్వాములపై ఒత్తిడి చేసి మరీ గుంజుతున్నట్టు తెలుస్తోంది. ఎందుకివ్వాలని కొందరు ఎదురుతిరిగితే వారిని బెదిరింపులకు గురిచేయడం రివాజుగా మారుతోంది.

– సాక్షి, తిరుపతి

- దందా ప్రారంభించిన టీడీపీ
- త్వరలో అధికారం తమదే అంటూ బెదిరింపులు
- ఒక్కో వ్యాపారి రూ.25 లక్షలు కట్టాల్సిందే అంటూ హుకుం
- మరో వైపు ఇన్‌చార్జి పదవి కట్టబెడతామంటూ పార్టీ నాయకుల నుంచి వసూళ్లు
- ఫండ్ పేరుతో కార్యకర్తల నుంచి కూడా..

ఇన్‌చార్జ్ పదవి పేరుతో వసూళ్లు

కుప్పం పార్టీ శ్రేణుల మధ్య ఇన్‌చార్జ్ పదవి చిచ్చుపెట్టారు. పేరుకే ఇన్‌చార్జ్ అయినా పెత్తనం అంతా చంద్రబాబు పీఏ మనోహర్‌దే. ఆయనపై చంద్రబాబు అసంతృప్తిగా ఉన్నారని, ఈ సారి ఇన్‌చార్జ్ అయితే చక్రం తిప్పొచ్చని వారికి లేనిపోని ఆశలు కల్పించి పోటీపెట్టారు. కుప్పం ఇన్‌చార్జ్ పదవి కావాలంటే.. పార్టీకి ఫండ్ ఇవ్వాలంటూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. గతంలోనూ ఇదేవిధంగా ఇన్‌చార్జ్ మునిరత్నంని మారుస్తున్నామంటూ ప్రచారం చేసి ఆయన్నే కొనసాగించారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న మునిత్నంని తప్పించి.. ఆ స్థానాన్ని వేరొకరికి కట్టబెడుతారనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి పాలైన త్రిలోక్‌కి ఇన్‌చార్జ్ పదవిని కట్టబెట్టాలని స్థానిక టీడీపీ నాయకులంతా డిమాండ్ చేస్తున్నారు. అయితే త్రిలోక్‌ని చంద్రబాబు పీఏ, ఇన్‌చార్జ్ వర్గీయులు విభేదిస్తున్నారు.

ఆ సామాజిక వర్గం వారికే ఇవ్వాలని..

ఇన్‌చార్జ్ పదవి కోసం ఒకరి మధ్య ఒకరికి పోటీ పెట్టి చివరకు చంద్రబాబు అనుకున్న వ్యక్తినే నియమించడం ఆయన నైజం. అందులో భాగంగా తన సామాజికవర్గం వారికే ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. పార్టీ కార్యాలయ ఇన్‌చార్జ్‌గా ఉన్న కాళ్లప్ప నాయుడి పేరు వినిపిస్తోంది. ఇతనకి వయస్సు మీదపడుతుండడంతో వేరొకరి పేరు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉంటే.. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ని ప్రస్తుతానికి ఇన్‌చార్జ్ వ్యవహారాలు చూడమని చంద్రబాబు ఆదేశించినట్లు సమాచారం. ఇతను కూడా తన సామాజికవర్గం కావడంతోనే కందుకూరు నుంచి కుప్పంలో తీసుకొచ్చిపెట్టారని ప్రచారం ఉంది. త్వరలోనే ఇతనికే కుప్పం ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం కూడా వినిపిస్తోంది. తన సామాజిక వర్గం వారికే ఇవ్వాలి అనుకున్నప్పుడు ఈ పోటీ ఎందుకు పెట్టడం అంటూ మండిపడుతున్నారు. ఇలా పోటీలు పెట్టి చంద్రబాబుకు వేడుక చూడడం వెన్నతో పెట్టిన విద్య అని లోలోనే మదనపడుతున్నారు.

సింహ వాహనంపై చిద్విలాసం

రాపూరు: పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం శ్రీవారి జన్మదినాన్ని పురస్కరించుకొని నృసింహ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం సింహ వాహనంపై శ్రీవారు యోగనరసింహస్వామి అలంకరణలో కోన మాడవీధుల్లో ఊరేగుతూ కనువిందు చేశారు. నెల్లూరు, కడప, చిత్తూరు జిల్లాల నుంచేగాక తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. క్రేన్ మండపంలో శ్రీవారు, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవేరులకు నవకలశ స్నపన తిరుమంజనాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

వైభవంగా ఊంజల్‌సేవ

గురువారం రాత్రి 7గంటలకు పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవేరులకు ఊంజల్‌సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఊంజల్‌సేవను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. చైర్మన్ చెన్నుతిరుపాల్‌రెడ్డి, ఈఓ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

గరుడ గోవిందం

రాత్రి బంగారు గరుడ వాహనంపై లక్ష్మీనరసింహస్వామి కోన మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. భక్తుల గోవిందనామస్మరణతో పెంచలకోనలోని వెలుగొండలు మార్మోగాయి.



సింహ వాహనంపై ఆశీనులైన శ్రీవారు

నేడు శ్రీవారి తిరుకల్యాణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 6 గంటలకు శ్రీవార్లకు పూలంగిసేవ, 9గంటల 50 నిమిషాలకు శ్రీవారి కల్యాణం, సాయంత్రం 6 గంటలకు రథోత్సవం, రాత్రి 9 గంటలకు గజ వాహన సేవ, 12 గంటలకు ఏకాంతసేవ జరగనున్నట్టు ఏసీ వెంకటసుబ్బయ్య తెలిపారు.



బంగారు గరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం



వకుళామాత ఆలయం వద్ద షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, పేరూరు బండపై వెలసిన వకుళామాత అమ్మవారి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను గురువారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. షాపింగ్ కాంప్లెక్స్ వల్ల భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. టీటీడీ పాలకమండలి సభ్యులు పోకల అశోక్‌కుమార్, పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

కెనటిక్ గ్రీన్ షోరూం ప్రారంభం


షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి


షోరూం అధినేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: రేణిగుంట రోడ్డులో అంకుర హాస్పిటల్ ఎదురుగా విజన్ ఆటో మొబైల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కెనటిక్ గ్రీన్ ఎలక్ట్రికల్ టూవీలర్, త్రీ వీలర్ వెహికల్స్ షోరూంను గురువారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పొల్యూషన్ తగ్గించే ఎలక్ట్రికల్ వెహికల్స్ వాడకం పెరగాలన్నారు. షోరూం మేనేజింగ్ డైరెక్టర్ కాపిరెడ్డి జయచంద్రారెడ్డిని అభినందించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మేయర్ శిరీష, డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి షోరూం యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, కాపిరెడ్డి రమేష్‌రెడ్డి, డాక్టర్లు హేమకుమార్‌రెడ్డి, హరిబాబు, కెనటిక్ గ్రీన్ కంపెనీ రీజనల్ మేనేజర్ జమీర్, స్టేట్ హెడ్ జగన్, విజన్ ఆటో మొబైల్స్ సీఈవో రమేష్, సీనియర్ మేనేజర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

వేగంగా వచ్చి బస్సులను ఢీకొట్టిన లారీ

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం, అగరాల జాతీయ రహదారిపై ఆగి ఉన్న బస్సును లారీ ఢీకొనడంతో ఐదుగురు గాయాల పాలైన ఘటన గురువారం తెల్లవారు జామున చోటుచేసుకోంది. పోలీసుల కథనం.. అస్సాం నుంచి కేరళకు వెళుతున్న ప్రైవేట్ బస్సు ప్రయాణికులతో అగరాల వద్ద రోడ్డు పక్కన ఆగింది. అదే సమయంలో తిరుపతి నుంచి చిత్తూరు వైపు వెళుతున్న లారీ వెనుక వైపు నుంచి బస్సును ఢీకొంది. ఆ బస్సు వెళ్లి ముందు ఉన్న మరో లారీని గుద్దింది. ఈ ఘటనలో అస్సాంకు చెందిన రంజనాబేగం, ఇక్బాల్ హుస్సేన్, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్‌కు సైతం గాయమైంది.

పల్లె సంస్కృతికి పట్టాభిషేకం

- జనం మెచ్చిన సేవకుడు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి
- సంపూర్ణ ప్రజామద్దతు సీఎం జగనన్నకే
- గడప గడపకు మహా పాద యాత్రలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి


కొటబైలు పంచాయతీలో అశేష జనవాహిని మధ్య మోహిత్‌రెడ్డి పాదయాత్ర

భాకరాపేట : జనం మెచ్చిన ప్రజాసేవకుడు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అని, ఆయన చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో పల్లె సంస్కృతికి పట్టాభిషేకం చేశాని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారిగడ్డ, కొటబైలు పంచాయతీలలో గురువారం జరిగిన గడపగడపకు మహా పాద యాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా రంగన్నగారిగడ్డ పంచాయతీలో పెద్దపల్లె, హరిజనవాడ, గువ్వలవారిపల్లె, పిచ్చిగుంట్లవారిపల్లె, తొగటపల్లె గ్రామాలతోపాటు కొటబైలు పంచాయతీలో నల్ల ఓబులవారిపల్లె, బత్తినవారిపల్లె, చెరుకువారిపల్లె, సాయిబూలపల్లె, గుల్లావాండ్లపల్లె, చెన్నారెడ్డిగారిపల్లిలో గడపగడపకూ వెళ్లి స్థానికులను పలకరించారు. సమస్యలు అడిగితెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించారు. కొటబైలు పంచాయతీలో వర్షం సైతం లెక్క చేయకుండా పాదయాత్ర కొనసాగించారు.

మళ్లీ జగనన్నను సీఎంను చేద్దాం

ఏ రాజకీయ పార్టీకి లభించని ప్రజామద్దతు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి లభించిందని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. 2024 ఎన్నికల్లో తిరిగి సీఎం జగనన్న ప్రభుత్వం ఏర్పాటుతో నిర్విఘ్నంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ప్రస్తుతం మెరుగైన వైద్య సేవలందించేందుకు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రంగన్నగారిగడ్డ పంచాయతీ పరిధిలో రూ.2.7 కోట్లతో, కొటబైలు పంచాయతీలో రూ.6.6 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు వెల్లడించారు.


సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న మోహిత్‌రెడ్డి

పాదయాత్రలో ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, జెడ్పీటీసీ స్వరూప, పార్టీ డివిజన్ అధ్యక్షుడు అక్బర్, రంగన్నగారిగడ్డ, కోటబైలు సర్పంచ్‌లు యువజ్యోతి, రెడ్డెమ్మ, ఎంపీటీసీ నిర్మల, ఉప సర్పంచ్ కిషోర్‌చైతన్యరెడ్డి, పార్టీ నాయకులు మదనమోహనరెడ్డి, సిద్ధరామిరెడ్డి, రామ్మూర్తి, ఉప సర్పంచ్ మాబూసాహెబ్, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, హేమందర్ రెడ్డి, పార్టీ నాయకులు మహేందర్‌రెడ్డి, చెంగల్‌రెడ్డి, చలపతి, రఫీఖాన్, సచివాలయ కన్వీనర్‌లు ఖాదర్‌బాషి, రమేష్ పాల్గొన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.63,430
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,696

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.78,500
రిటైల్ వెండి గ్రాము	రూ.80.50

ఘనంగా వెంగమాంబ జయంతి

తిరుమల: మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 293వ జయంతిని పురస్కరించుకుని తిరుమలలోని వెంగమాంబ బృందావనంలో గురువారం సాయంత్రం టీటీడీ అధికారులు పుష్పాంజలి సమర్పించారు. శ్రీవారిపై భక్తివిశ్వాసాలు ప్రదర్శించిన వెంగమాంబ 1730లో జన్మించారు. 1817లో సజీవ సమాధి చెందారు. తిరుమలలో అన్నదానాన్ని ప్రారంభించినందుకు గుర్తుగా వెంగమాంబ పేరు మీదుగా మాతృశ్రీ అనే పదం చేరింది. అన్నమాచార్య సంచాలకులు డాక్టర్ విభీషణశర్మ, వెంగమాంబ వంశీయులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయండి

గూడూరు: పార్టీ విజయానికి మీ వంతు కృషి చేయాలని ఎన్‌ఆర్‌ఐ విభాగ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్ర రెడ్డి పిలుపునిచ్చారు. సింగపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో సింగపూర్‌లోని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఆయన గురువారం భేటీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమంతోపాటు, పెద్ద ఎత్తున జరుగుతున్న అభివృద్ధిని వివరించాలన్నారు. అనంతరం ఆ భేటీలో పాల్గొన్న వారి సమస్యలను, సూచనలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు కోటిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, మురళీకృష్ణారెడ్డి, సంతోష్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, శివప్రసాద్, విజయభాస్కర్, సందీప్, చంద్ర, కృష్ణారెడ్డి, కుమార్, లింగారెడ్డి, అక్కిరెడ్డి, యగంధర్, భూమరాజు, జీవన్, యోగి పాల్గొన్నారు.


వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో జ్ఞానేంద్రరెడ్డి

సీఆర్‌రెడ్డి కుటుంబంతో రోగులకు భరోసా

గూడూరు: జిల్లాలో ఏ ప్రాంతానికి చెందిన వారికైనా జబ్బు చేసి చెన్నైకి వెళ్లితే సీఆర్‌రెడ్డితోపాటు, ఆయన కుటుంబ సభ్యుల ద్వారా వారికి భరోసా లభించేదని రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని డాక్టర్ సీఆర్‌రెడ్డి కల్యాణ మండపంలో గురువారం సీఆర్‌రెడ్డి సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా మంత్రితోపాటు, ఎస్పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు తదితరులు సీఆర్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన ఎవరైనా వైద్యం కోసం చెన్నైకి వెళ్తే, సీఆర్‌రెడ్డి కుమారుడైన సుధీరన్న వారికి సకాలంలో వైద్యం అందజేవారన్నారు. అలాగే గూడూరు ప్రాంతంలో అయితే సీఆర్‌రెడ్డి, ఆయన కుమార్తె డాక్టర్ రోహిణి, జనార్దన్‌రెడ్డి సిఫార్సు లెటరు తీసుకెళ్తే ఎంతో మేలు జరిగేదన్నారు. వారి కుటుంబంలోని వారంతా వైద్యులు కావడంతో ఈ ప్రాంత ప్రజలకు ఎంతో భరోసాగా ఉండేదన్నారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ అతి తక్కువ ఫీజుకే ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు పేద విద్యార్థులకు విద్యనందించిన ఘనత సీఆర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అలాగే సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుండేవారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే వరప్రసాద్ రావు మాట్లాడుతూ సీఆర్‌రెడ్డి లేని గూడూరును ఊహించలేమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మేరుగ మురళీధర్, తెలంగాణ ఎమ్మెల్యే ఉపేంద్రరెడ్డి, పార్టీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కనుమూరు హరిచంద్రారెడ్డి, గూడూరు శ్రీనివాసులరెడ్డి, చింతంరెడ్డి విద్యాసాగర్‌రావు, డాక్టర్ మెహర్మణి పాల్గొన్నారు.


సీఆర్‌రెడ్డి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న వేమిరెడ్డి, వెలగపల్లి తదితరులు

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- రూ.35 లక్షల సొత్తు స్వాధీనం
- తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

తిరుపతి క్రైమ్: తిరుపతి నగరంలో రాత్రి పూట ఇంటి దొంగతనాలకు పాల్పడే నలుగురు అంతర్రాష్ట్ర దొంగలను అలిపిరి పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కర్ణాటకకు చెందిన కృష్ణప్ప రాజేష్(20), చిత్తూరుకు చెందిన ఎం.భాను ప్రకాష్ అలియాస్ భాను (23), తిరుపతికి చెందిన డి.చందు(24), సత్యసాయి జిల్లాకు చెందిన ఎస్.రామాంజనేయులు అలియాస్ సాయిరాం(24) ముఠాగా ఏర్పడి బుధవారం సాయంత్రం ఆటోనగర్ బస్ స్టాప్ వద్ద అనుమానాస్పదంగా కనిపించగా సీఐ అబ్బన్న, ఎస్ఐ నరసింహారావు సిబ్బందితో కలిసి వారిని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. అనంతరం వారి నుంచి 870 గ్రాముల బంగారు స్వాధీనం చేసుకోగా వాటి విలువ సుమారు రూ.35 లక్షలు ఉంటుందన్నారు.

పగలు రెక్కీ.. రాత్రి చోరీ

విచారణలో ఆసక్తికరమైన విషయాలు బయటపడ్డాయి. నగరంలో రాత్రి సమయంలో తాళం వేసిన ఇళ్లను గుర్తించి పగలంతా రెక్కీ నిర్వహిస్తారు. అనంతరం రాత్రి సమయంలో సదరు నలుగురు వ్యక్తులు చాకచక్యంగా ఇంట్లోకి ప్రవేశించి దొంగతనాలకు పాల్పడేవారని తెలిపారు. వీరిపై అలిపిరి పోలీస్ స్టేషన్లో 3 కేసులు, చంద్రగిరి పోలీస్ స్టేషన్లో ఒక కేసు నమోదు అయిందన్నారు. వీరు గతంలో పుత్తూరు, చంద్రగిరి, కార్వేటినగరం, వాల్మీకిపురం, బిట్రగుంట, కొత్తచెరువు, ఓడీసీ పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు రకాల దొంగతనాలు చేసి జైలుకు వెళ్లి వచ్చారన్నారు. ఈ నిందితులపై మన రాష్ట్రంతో పాటు కర్ణాటక, తెలంగాణలో కూడా ఒక్కొక్కరిపై 10 నుంచి 15 కేసులకు పైగా ఉన్నాయన్నారు. వీరిపై పీడీ యాక్ట్ కేసు కూడా నమోదైందని చెప్పారు. ఈ కేసును ఛేదించడంలో ఈస్ట్ సబ్ డివిజనల్ డీఎస్పీ సురేందర్ రెడ్డి, సీఐ అబ్బన్న, ఎస్ఐలు ఎంతగానో కృషి చేశారన్నారు. సమావేశంలో ఏఎస్పీలు కులశేఖర్, విమల్‌కుమారి ఉన్నారు.


నిందితులను చూపిస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

అనుమానం పెనుభూతమై!

- ఎల్లసిరిలో మహిళ దారుణ హత్య
- భార్య తల నరికి పోలీసులకు లొంగిపోయిన భర్త

చిట్టమూరు: అనుమానం పెనుభూతమైంది. భార్య తలనరికి భర్త పోలీసులకు లొంగిపోయిన ఘటన మండలంలోని ఎల్లసిరి దళితవాడలో కలకలం రేపింది. పోలీసులు, స్థానికుల వివరాలు.. ఎల్లసిరి గ్రామానికి చెందిన హరీష్‌కు, చిట్టమూరు మండలం, ఎల్లూరు గ్రామానికి చెందిన మధవితో 2015లో వివాహం జరిగింది. వీరికి ఒక బాబు, కుమార్తె ఉన్నారు. సజావుగా సాగిన వీరి కాపురంలో పది నెలలక్రితం కలహాలు, భార్యపై అనుమానం పెరగడంతో ఇద్దరూ విడిపోయారు. మాధవి తమ స్వగ్రామం ఎల్లూరులో, భర్త హరీష్ దొరవారిసత్రం మండలం, తొగరాముడి గ్రామంలో ఉంటున్నారు. వారం క్రితం గ్రామపెద్దలు చిట్టమూరు పోలీస్ స్టేషన్‌లో రాజీ కుదిర్చి భార్యాభర్తలు ఎల్లసిరి గ్రామంలో ఉండేలా ఒప్పందం చేశారు. అయితే భర్త హరీష్ తాను తొగరాముడిలో గొర్రెలు మేపుతున్నానని, రాత్రి పూట ఇంటికి వస్తానని చెప్పాడు. ఈ క్రమంలో రాత్రి పూట ఇంటికి వచ్చినా మిద్దెపై నిద్రించి ఉదయాన్నే వెళ్లిపోయేవాడు. మాధవి ఇంట్లో ఒక్కటే ఉండలేక తల్లిని తోడు తెచ్చుకుని ఉంటోంది. తల్లి బుధవారం రాత్రి ఎల్లూరు గ్రామానికి వెళ్లింది. మాధవి ఇంటి వద్ద ఒక్కటే ఉండలేక ఎల్లసిరి గ్రామంలోనే ఉన్న తన పిన్ని ఇంటికి వెళ్లి పడుకుంది. తర్వాత ఉదయం తన ఇంటికి వచ్చి ఇంటి పనులు చేసుకుంటోంది. ఇంతలో భర్త ఇంటికి రాగానే మచ్చు కత్తి తీసుకుని భార్య మాధవి గొంతు కోయడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. భార్యను నరికిన కత్తితో హరీష్ చిట్టమూరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. వాకాడు సీఐ హరికృష్ణ, చిట్టమూరు ఎస్ఐ లక్ష్మీభవాని ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



సంఘటనా స్థలంలో విచారిస్తున్న ఎస్ఐ లక్ష్మీభవాని , మాధవి (ఫైల్)

ఇంటర్ విద్యార్థులకు ఐటీ రంగంలో శిక్షణ

తిరుపతి అర్బన్ : ఇంటర్మీడియెట్ పూర్తిచేసిన విద్యార్థులకు హెచ్‌సీఎల్-టెక్ బీ ద్వారా ఐటీ రంగాలలో శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్యాంమోహన్ తెలిపారు. అభ్యర్థులు ఇంటర్మీడియెట్‌లో 2021-22 సంవత్సరంలో 60 శాతం, 2023 సంవత్సరంలో 75 శాతం మార్కులతో ఉతీర్ణత సాధించిన విద్యార్థులు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. అభ్యర్థులు http://bit. ly/techbee22 లింక్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. 6వ తేదీ ఎయిర్‌బైపాస్‌రోడ్డు, న్యూబాలాజీ కాలనీలోని ఎస్‌డీహెచ్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఉదయం 9గంటలకు హెచ్‌సీఎల్-టెక్ బీ ఆన్‌లైన్ పరీక్ష ఉంటుందని, స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 9032697478, 7675827308, 8074919939, 9963859160 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

వైభవంగా చిన్న కొట్టాయి ఉత్సవం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో చిన్నకొట్టాయి ఉత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఆలయ అలంకార మండపంలో స్వామి,అమ్మవార్లకు పూజలు నిర్వహించి, అనంతరం ఊరేగింపుగా ఆలయ ఆవరణంలోని పగడచెట్టు వద్దకు తీసుకువచ్చారు. అక్కడ అభిషేక, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఆలయంలో ఊరేగించారు. ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు.

